కన్హాను సందర్శించిన సీఎం

- శాంతివనంలో దాజీతో కలిసి మొక్క నాటిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు శంకర్, యాదయ్య

నందిగామ, డిసెంబర్ 29 : మండలంలోని కన్హాశాంతివనాన్ని ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందర్శించారు. కన్హాకు చేరుకున్న ఆయనకు హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ పటేల్, మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, షాద్‌నగర్, చేవెళ్ల ఎమ్మెల్యేలు శంకర్, యాదయ్యలు పూల బొకేలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రజాసంక్షేమం కోసం ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలనే విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి, ధ్యాన గురువు కమలేశ్ పటేల్ ఇరువురు కలిసి కొద్దిసేపు చర్చించారు. కన్హాలో విద్యార్థులు, చిన్నారులకు అందించే సాఫ్ట్‌స్కిల్స్‌కు సంబంధించిన వివరాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. కండ్లకు గంతలు కట్టుకుని రంగులు గుర్తించడం, పదాలను చదివిన విద్యార్థులను అభినందించారు. ఇలాంటి స్కిల్స్‌ను ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో అమలు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అనంతరం కన్హా ఆవరణలో పద్మ భూషణ్ దాజీతో కలిసి ప్రత్యేకమైన గాలిబుడగ అనే మొక్కను సీఎం రేవంత్‌రెడ్డి నాటారు. రెయిన్ ఫారెస్ట్, టిష్యూ కల్చర్ ల్యాబ్, గ్రీన రీని పరిశీలించారు. పచ్చని చెట్లతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉన్నదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కన్హాలో మొక్క నాటుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, ధ్యాన గురువు కమలేశ్ పటేల్, ఎమ్మెల్యేలు శంకర్, యాదయ్య

న్యూఇయర్ జోష్

నూతన సంవత్సర వేడుకలకు ముస్తాబవుతున్న రిసార్ట్‌లు, ఫామ్‌హౌస్‌లు

- రంగారెడ్డి జిల్లాలో మూడు వేలకు పైగానే..
- ఆకర్షణీయ ఆఫర్లు ప్రకటిస్తున్న నిర్వాహకులు
- జిల్లాలో సినీ ప్రముఖులు, సెలబ్రిటీలకు చెం దిన వే రిసార్టులు అధికం

రంగారెడ్డి, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో న్యూఇయర్ వేడుకల జోష్ అప్పుడే ఆరంభమైంది. ఇందుకోసం రిసార్ట్‌లు, ఫామ్‌హౌస్‌లు ముస్తాబవుతున్నాయి. నిర్వాహకులు ఆకర్షణీయమైన ఆఫర్లతో బుకింగ్‌లు చేసుకుంటున్నారు. ప్రతి ఏటా నూతన సంవత్సర వేడుకలను సెలబ్రిటీలు, నగరవాసులు, రాజకీయ నాయకులు, యువతీయువకులు రిసార్ట్‌లు, ఫామ్‌హౌస్‌ల్లో జరుపుకొంటున్నారు. మొయినాబాద్, శంకర్‌పల్లి, గండిపేట, రాజేంద్రనగర్, మహేశ్వరం, కందుకూరు, కడ్తాల్, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాలతోపాటు నగర శివారుల్లోని పలు ప్రాంతాల్లో రిసార్ట్‌లు, ఫామ్‌హౌస్‌లున్నాయి. న్యూఇయర్ సందర్భంగా వాటిని రంగురంగుల విద్యుత్‌దీపాలతో నిర్వాహకులు సుందరంగా అలంకరిస్తున్నారు.

జిల్లాలో 3,000పైగా..

జిల్లాలో అతి పెద్దదైన రామోజీ ఫిలింసిటీతో పాటు పలు ప్రాంతాల్లో 3000 పైగా రిసార్ట్‌లు, ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. ఇప్పటికే రామోజీ ఫిలింసిటీలో న్యూఇయర్ వేడుకల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే, నగర శివారుల్లోని పలు ప్రాంతాల్లో ఉన్న రిసార్ట్‌ల్లోనూ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వారం రోజుల నుంచి న్యూఇయర్ వేడుకలకు సంబంధించి బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. ఇందులో వీఐపీ పాసులు, వీవీఐపీ పాసులు, కపుల్స్, చిల్డ్రన్స్ వంటి వారికి ప్రత్యేక ఆఫర్లను ప్రకటించారు. పలు రిసార్ట్‌ల్లో డిసెంబర్ 31 రోజు రాత్రంతా గడిపేందుకు వచ్చే వారికోసం సాంస్కృతిక కార్యక్రమాలు, డీజేలు, ఇతరత్రా కల్చరల్ ప్రోగ్రాంలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో జిల్లాలోని చిన్నా, చితక రిసార్ట్‌లు, ఫామ్ హౌస్‌ల్లోనూ న్యూఇయర్ వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

సెలబ్రిటీలకు చెందినవే..

జిల్లాలో ఉన్న రిసార్టుల్లో అత్యధికంగా సెలబ్రిటీలు, సినీ ప్రముఖులకు చెందినవే ఉన్నాయి. దీంతో వారు జిల్లాలోనే న్యూఇయర్ వేడుకలు జరుపుకొనేందుకు సిద్ధమవుతున్నారు. శంకర్‌పల్లి, మహేశ్వరం, పహాడీ షరీఫ్ ప్రాంతాల్లో అత్యధికంగా సినీ ప్రముఖులకు సంబంధించిన రిసార్ట్‌లున్నాయి. అలాగే, ఇటీవల జేబీలో నిర్మించిన విల్లాస్‌లోనూ సెలబ్రిటీలకు సంబంధించిన వారే ఎక్కువగా ఉన్నారు.

ఈవెంట్లకు అనుమతి తప్పనిసరి

న్యూఇయర్ వేడుకల ఈవెంట్లు నిర్వహించే వారు తప్పనిసరిగా పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలి. ముందుగా అనుమతులు పొందిన తర్వాతే ఈవెంట్లు నిర్వహించుకోవాలి. అలాగే, డీజేలకు అనుమతిలేదు. మద్యం అతిగా తాగి రోడ్లపైకి రావొద్దు. శాంతియుత వాతావరణంలో న్యూఇయర్ వేడుకలను జరుపుకోవాలి. **-సునీతారెడ్డి, మహేశ్వరం డీసీపీ**

హార్డ్ కాపీలు సమర్పించాలి

సిటీబ్యూరో : వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలోకి వచ్చే ప్రభుత్వ, ప్రైవేట్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ నర్సింగ్, ఇతర కళాశాలకు సంబంధించి 2017-18 నుంచి 2024-25సంవత్సరం వరకు పెండింగ్ ఉన్న ఉపకార వేతనాలకు సంబంధించిన దరఖాస్తు ఫారాల హార్డ్ కాపీలను వచ్చే నెల 20వ తేదీలోగా జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని బీసీ వెల్ఫేర్‌శాఖ ఉప సంచాలకులు ఆశన్న సూచించారు.

ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలి

కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సూచించారు. మండలంలోని లేమూరు మీదుగా వెళుతూ మార్కెట్ వద్ద ప్రజలను చూసి కారు ఆపి వారి వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఏ విధంగా ఉందని ప్రశ్నించగా ఇచ్చిన మాటకు కట్టుబడి లేదని పలువురు ఆమెకు తెలిపారు. అనంతరం దివ్యాంగుడితో మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు గణేశ్, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. -కందుకూరు, డిసెంబర్ 29

రామకృష్ణకు పుడమి విద్యారత్న అవార్డు

తాండూరు పట్టణానికి చెందిన పర్యాద రామకృష్ణకు పుడమి విద్యారత్న అవార్డు వరించింది. సామాజిక, విద్యారంగాల్లో అతడు చేస్తున్న సేవలను గుర్తించిన పుడమి సాహితీ కళావేదిక అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో పద్మశ్రీ వనజీవ రామయ్య, కంచర్ల శ్రీనివాస్ చేతుల మీదుగా రామకృష్ణ జాతీయ విశిష్ట సేవా పుడమి విద్యారత్న అవార్డును అందుకున్నారు. - తాండూరు, డిసెంబర్ 29

మోదీ ప్రభుత్వం..పేదల నడ్డి విరుస్తున్నది

- అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి
- జిల్లా మహాసభల్లో సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుదర్శన్

ఇబ్రహీంపట్నం రూరల్, డిసెంబర్ 29 : ప్రధాని మోదీ ప్రభుత్వం దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జాన్‌వెస్లీ, డీజీ నర్సింగ్‌రావు అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం భారత్‌గార్డెన్‌లో జరిగిన సీపీఎం రంగారెడ్డిజిల్లా మహాసభల్లో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదానికి కొమ్ముకాస్తున్నదని.. దేశంలోని సంపదనంతా అదానీ, అంబానీలకు కట్టబెడుతూ పేదల నడ్డి విరుస్తున్నదని మండిపడ్డారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేసినా ఆయన్ను ఇంకా మంత్రివర్గం నుంచి తొలగించకపోవడం సిగ్గుచేటన్నారు. మోదీ హయాంలో లౌకికవాదం, ఫెడలిజం, సమానత్వం మంట కలిసిపోయాయని విమర్శించారు. అలాగే, రాష్ట్రంలో ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధును పూర్తిగా ఎత్తివేసేందుకు సర్కారు యత్నిస్తున్నదని మండిపడ్డారు. పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భూపాల్, జంగారెడ్డి, యాదయ్య, సామెల్, మధుసూదన్‌రెడ్డి, చంద్రమోహన్, కవిత, జగదీశ్, జంగయ్య, అంజయ్య, జగన్, బుగ్గరాములు, జంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ధ్యాన మహాయాగంలో ఆధ్యాత్మిక పుస్తకాలను ఆవిష్కరిస్తున్న పరిణతి పత్రీ తదితరులు

ధ్యానంతో బుద్ధిబలం పెరుగుతుంది..

- పీఎస్ఎస్ఎం గ్లోబల్ వ్యవస్థాపకురాలు పరిణతి పత్రీ
- తొమ్మిదో రోజుకు చేరుకున్న పత్రీజీ ధ్యాన మహాయాగం మహాసభలు

కడ్తాల్, డిసెంబర్ 29 : నిత్య ధ్యాన సాధనతో బుద్ధిబలం పెంపొంది ఆత్మజ్ఞానులవుతారని, మన నడవడికతోనే ఎదుటి వారితో గౌరవం పొందుతామని పీఎస్ఎస్ఎం గ్లోబల్ వ్యవస్థాపకురాలు పరిణతి పత్రీ అన్నారు. మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర మహాపిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగం -3 మహాసభలు శనివారానికి తొమ్మిదోరోజుకు చేరుకున్నాయి. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు సంజయ్ కింగీ-గణేశ్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన, ప్రాతఃకాల సంగీత ధ్యానంలో పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్యానుల నుద్దేశించి పరిణతి పత్రీ మాట్లాడుతూ.. మనం తీసుకునే ఆహారం, నడవడిక, విశ్రాంతి, ఆనందం అన్ని సమపాళ్ల లో ఉండాలన్నారు. మనకున్న దానితోనే ఆనందంగా ఉండాలని, సకర్మలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని.. మనలోని దుఃఖాన్ని దింగమింగితే ధ్యానులవుతారని పేర్కొన్నారు. శాఖహార జగత్‌కు ప్రతి ధ్యానీ కృషి చేయాలని కోరారు. పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ధ్యానులకు అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. అనంతరం ధ్యాన గురువులు రచించిన ఆధ్యా త్మిక పుస్తకాలను పరిణతి పత్రీ ఆవిష్కరించారు. ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలకు చెందిన పిరమిడ్ మాస్టర్లు తమ సందేశాలను ఇచ్చారు. కార్యక్రమంలో మీడియా కో-ఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు, బాలకృష్ణ, శ్రీరాంగోపాల్, దామోదర్‌రెడ్డి, శివప్రసాద్, నిర్మల, మధుమోహన్, హనుమంతురావు, చంద్రశేఖర్, హనుమంతురాజు, రాజేశ్, రాంబాబు పాల్గొన్నారు.

బుక్ ఫెయిర్ చివరి రోజు అధిక సంఖ్యలో తరలివచ్చిన పుస్తక ప్రియులు

పుస్తకం కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది

- ముగింపు సభలో జస్టిస్ రాధారాణి
- ముగిసిన బుక్ ఫెయిర్
- చివరి రోజు భారీగా తరలివచ్చిన పుస్తక ప్రియులు

చిక్కడపల్లి, డిసెంబర్ 29 : ఇందిరాపార్క్ సమీపంలో కళాభారతి ఎన్‌టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న బుక్‌ఫెయిర్ ఆదివారంతో ముగిసింది. 10 రోజులుగా కొనసాగుతున్న పుస్తక ప్రదర్శనలో చివరిరోజు పాఠకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ముగింపు సభకు జస్టిస్ రాధారాణి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సంపాదకుడు రామచంద్రమూర్తి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ పుస్తకం మనల్ని కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందన్నారు. ప్రపంచంలో అనేక మార్పులు పుస్తకాలు తెస్తాయన్నారు. మనం చదవడంతో పాటు పిల్లల్ని చదివించాలని సూచించారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ కంప్యూటర్ వచ్చిన పుస్తకాల విలువ తగ్గలేదన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం పుస్తకాలు చదువుతూ ఉండటం సంతోషకరం అని అన్నారు. బుక్‌ఫెయిర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కవి యాకూబ్, ఆర్.వాసులు మాట్లాడుతూ బుక్ ఫెయిర్‌కు 37 యేండ్ల చరిత్ర ఉందని అన్నారు. బుక్ ఫెయిర్‌కు జనాల ఆదరణ పెరిగిందన్నారు. సమాజానికి కావలిసిన జ్ఞానాన్ని అందించే పండుగ పుస్తక పండుగ అని అన్నారు. ఈ రోజుతో బుక్ ఫెయిర్ విజయవంతంగా ముగిసిందన్నారు. ఈ సమావేశంలో బుక్ ఫెయిర్ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, కోశాధికారి నవ చేతన నారాయణ రెడ్డి, శోభన్ బాబు, సురేశ్, సూరిబాబు, సాంబశివరావు, శ్రీకాంత్, శ్రీనివాస్, స్వరాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, మాజీ న్యాయమూర్తి, ప్రముఖ రచయిత డాక్టర్ మంగారి రాజేందర్

మూడు పుస్తకాల ఆవిష్కరణ..

దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ వారు మూడు సాహిత్య చారిత్రక పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత డాక్టర్ మంగారి రాజేంద్ర (జింబో) రచించిన 'కోర్టు తీర్పుల్లో సాహిత్య మెరుపులు' రచయిత ఎమని శివనాగిరెడ్డి రచించిన 'తెలంగాణ శిథిలాలు వ్యథభరిత కథనాలు' రామోజు హరగోపాల్ రచించిన 'తెలంగాణ చరిత్ర తొవ్వలో' లాంటి పుస్తకాలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, ప్రముఖ సంపాదకుడు రామచంద్రమూర్తి, మాజీ న్యాయమూర్తి ప్రముఖ రచయిత డాక్టర్ మంగారి రాజేంద్ర హాజరై పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ మరుగున పడిన అనేక విషయాలను శివనాగి రెడ్డి వెలుగులోకి తెస్తారన్నారు. ప్రొఫెసర్ ఎస్.రఘు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చరిత్ర పరిశోధకుడు బి.వి భద్రగిరీశ్(తెలంగాన చరిత్ర కారుడు), డాక్టర్ శ్యాంసుందర్ రావు, దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేదకుమార్, శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

బుక్ ఫెయిర్ ముగింపు సభలో పాల్గొన్న జస్టిస్ రాధారాణి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రముఖ సంపాదకుడు రామచంద్రమూర్తి

కల్యాణం..వైభోగం



కొమురవెల్లిలో స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

- వైభవంగా మల్లన్న కల్యాణం
- వేద మంత్రోచ్ఛరణలతో మార్మోగిన కొమురవెల్లి క్షేత్రం
- పట్టువస్త్రాలు సమర్పించిన ఆలయ వర్గాలు
- హాజరైన ఎమ్మెల్యేలు రాజేశ్వర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి,

చేర్యాల, డిసెంబర్ 29 : సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. క్షేత్రంలోని తోటబావి వేదిక వద్ద జరిగిన కల్యాణోత్సవానికి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. వీరశైవ ఆగమశాస్త్ర ప్రకారం కల్యాణం నిర్వహించగా, పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఆలయవర్గాలు సమర్పించారు. కల్యాణంలో స్వామి వారి తరపున పడిగన్నగారి ఆంజనేయులు దంపతులు, అమ్మవార్ల తరపున మహదేవుని భాస్కర్ దంపతులు పాల్గొన్నారు. గర్భగుడిలో జరిగిన కల్యాణోత్సవంలో అమ్మవారి తరపున మహదేవుని రవి, స్వామి వారి తరపున పడిగన్నగారి మల్లయ్య దంపతులు పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అర్చకులు ఆలయం నుంచి పోలీసుబొమ్మ, రాతిగీరలు, ఆలయ పరిసరాల్లో ఊరేగించారు. మేళతాళాలు, కోలాటం, చెక్క భజనలు, వేద పాఠశాల విద్యార్థుల శివకీర్తనలతో కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. కాశీపీఠాధిపతి డాక్టర్ మల్లికార్జున శివాచార్య మహాస్వామి వేద పర్యవేక్షణలో కల్యాణం జరిగింది. వీరశైవ ఆగమ పండితులు, పురోహితులు, ఆగమ పాఠశాల వేదపండితులు, ఆగమ విద్యార్థులు కల్యాణోత్సవం నిర్వహించారు. పురోహితులుగా నడిపుడి మఠం భవనయ్య స్వా మి, భువనేశ్వరస్వామి, ఆనందయ్య, జ్ఞానశ్వర్ శాస్త్రి, చంద్రశేఖర్‌స్వామి, భద్రయ్యస్వామి వ్యహరించారు. డాక్టర్ మహంతయ్య, నందుల మఠం శశిభూషణ సిద్ధాంతి స్వామీజీ వ్యాఖ్యాతలుగా వ్యహరించారు. భక్తుల కోసం శామియానాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 5గంటలకు రెండు క్వింటాళ్ల బియ్యాన్ని అన్నం వండి రాశిగా తయారుచేసి దిష్టికుంభం తీశారు.

హాజరైన ప్రముఖులు

కల్యాణానికి ముందు ఊరేగింపుగా వెళ్లి స్వామి వారి తరపున మహదేవుని వంశస్తులు, పడిగన్నగారి వంశస్తులు కూర్చుని కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణానికి తాళి, మట్టెలు, ఒడిబియ్యం, బట్టలను వారు తీసుకొచ్చారు. మధ్యాహ్నం 12గంటలకు రుద్రాభిషేకం, సాయంత్రం శకటోత్సవం నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఆలయవర్గాలు సమర్పించాయి. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, నాగపురి రాజలింగం, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి హాజరయ్యారు. ఆలయ ఈవో బాలాజీ, దేవాదాయశాఖ ఆర్‌జేసీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారు లు బృందం, ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సిబ్బంది కల్యాణోత్సవం సవ్యంగా సాగేందుకు చర్యలు తీసుకున్నారు.